క్లుప్తంగా

పిచ్చికుక్కల స్వైర విహారం

చినగంజాం (పర్చూరు): మండలంలోని చెరుకూరులో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గత రెండు రోజులుగా గ్రామంలో 12 మందిపై దాడి చేసి విచక్షణ రహితంగా దాడి చేశాయి. ఉపాధి హామీ పనికి వెళ్లే కూలీలను, ఆరుబయట ఆడుకుంటున్న చిన్నారులను వెంబడించి కుక్కలు గాయపరిచాయి. గాయపడిన వారు చెరుకూరు ప్రాథమిక వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఈ పిచ్చికుక్కల దాటికి బయటకు వెళ్లాలంటేనే గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను వివరణ కోరగా గ్రామంలో పిచ్చికుక్కలు సంచరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో కుక్కలు పట్టేవారిని రప్పించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం పెంపు

బల్లికురవ: మెట్ట, మాగాణి భూముల్లో పచ్చిరొట్ట విత్తనాల సాగుతో భూసారం పెంచుకోవచ్చని వ్యవసాయాధికారిణి ఎస్వీపీ కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేస్తుందని కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మండలానికి 40 క్వింటాళ్లు జీలుగ, 40 క్వింటాళ్ల జనుము, 30 క్వింటాళ్ల పిల్లిపెసర్లు కేటాయించాలని వ్యవసాయాధికారిణి వివరించారు.

దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

అద్దంకి: మండలంలోని మైలవరం గ్రామంలో మోటారు వైర్లు చోరీ చేయడానికి వచ్చిన ముగ్గురు దుండగులను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అందిన సమాచారం మేరకు గ్రామంలో తరచూ వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీకి గురవుతున్నాయి. ఈ క్రమంలో రైతులు అప్రమత్తం అయ్యారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో మోటార్లు చోరీ చేసేందుకు వచ్చిన ముగ్గురు నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసలకు అప్పగించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

స్వర్ణమ్మతల్లి హుండీ లెక్కింపు

కారంచేడు: మండలంలోని స్వర్ణ గ్రామ దేవతగా విరాజిల్లుతున్న స్వర్ణమ్మతల్లి గుడి హుండీని గురువారం ఉదయం దేవదాయ శాఖాధికారులు లెక్కింపు చేపట్టారు. 2023 నుంచి ఇప్పటి వరకు గతేడాది స్వర్ణమ్మ గుడి తిరునాళ్ల తరువాత నుంచి ఇప్పటి వరకు హుండీ లెక్కించలేదని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. ఈఏడాది తిరునాళ్ల అనంతరం హుండీని లెక్కిస్తున్నామన్నారు. మొత్తం రూ 1.71 లక్షలు ఉన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కారంచేడు ఈఓ బీ శ్రీనివాసరావు, ఇడుపులపాడు ఈఓ పోతిన శ్రీనివాసరావు, స్వర్ణమ్మతల్లి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎండ.. ప్రచండం

- మాడు పగిలే ఉష్ణోగ్రతలు
- పనిచేయని ఏసీలు
- అల్లాడిపోతున్న ప్రజానీకం



కారంచేడులో 11 గంటలకే నిర్మానుషంగా మారిన ప్రధాన రహదారి



కారంచేడు ప్రాంతంలో మధ్యాహ్నం నమోదైన ఉష్ణోగ్రత

కారంచేడు: భానుడు తన ప్రచండ స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. గత రెండు రోజుల నుంచి వేడిగాలులకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సముద్ర తీర ప్రాంతం అయిన చీరాల, బాపట్ల ప్రాంతాలతో పాటు జిల్లాలోని అన్ని మండలాలు ఎండల తీవ్రతకు అల్లాడిపోతున్నాయి. ఏసీలు కూడా పనిచేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లోని మండలాలకు చెందిన ప్రజలు ఎండల తీవ్రతకు బయటకు రావడానికి కూడా భయపడిపోతున్నారు. ఉదయం 11 గంటల నుంచే భానుడు తన ప్రభావాన్ని చూపాడు. ఉదయం 11 గంటల సమయానికి ఈ ప్రాంతంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రధాన రహదారుల మీదకు ఒక్కరూ కూడా కనిపించలేదు. ప్రభుత్వం అధికారులు, వైద్యాధికారులు ముందుగానే ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. అత్యవసర పనులుంటే తప్పితే ఎవరూ బయటకు రావద్దని చేసిన హెచ్చరికలతో సాహసించలేకపోతున్నారు. ప్రజలు మాత్రం మరోక అడుగు అడుగు వెనుకకు వేసి పనులున్నా వాటిని వాయిదా వేసుకుంటున్నారే తప్పితే ఒక్కరు కూడా బయటకు రావడానికి హడలిపోయారు. ఈ ఎండల తీవ్రత సాయంత్రం అయినా తగ్గక పోవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి తాపానికి తాళలేక చలువ చేసే పానియాల వైపు జనం పరుగులు పెడుతున్నారు.



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు

హనిమిరెడ్డి గెలవాలని పాదయాత్ర

జే.పంగులూరు: వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి గెలవాలని బీసీ నాయకులు పాదయాత్ర చేపట్టారు. కొరిశపాడు మండలం బీసీ నాయకులు గోలి రమణ ఆధ్వర్యంలో పాదయాత్ర గురువారం నిర్వహించారు. ఈపాదయాత్ర మేదరమెట్ల నుంచి జాతీయ రహదారిపై పంగులూరు లక్ష్మిగణపతి షిరిడి సాయిబాబా మందిరం వరకు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో హనిమిరెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవాలని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 101 టెంకాయలు పగలుగొట్టారు. ఈపాదయాత్రలో గోలి రమణ తన ఇద్దరు చిన్నారులు, టి సుధాకర్, టి నాగరాజు, కె కనకయ్య, టీ శ్రీను, బాబురావు, ఎం వెంకటేశ్వర్లు (బైరు), యూ వెంకటేశ్వరావు, ఎస్ రాజశేఖర్, ఎస్ ప్రభాకర్, ఎస్ రాంబాబు, పి సురేష్, ఓ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను పూర్తిచేయాలి

యద్దనపూడి: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచేనాటికి పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులను సత్వరమే పూర్తిచేయాలని ఎంఈవో పుల్లెల సుబ్రమణ్యేశ్వరావు అన్నారు. గురువారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 12వ తేదీలోపు పాఠశాలలు తెరిచేనాటికి ఆయా పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, వంటశాలలు, మరుగుదొడ్లు, తదితర నిర్మాణపనులను పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ సుబ్రమణ్యేశ్వరావు

జామాయిల్ తోటలు దగ్ధం

అద్దంకి రూరల్: మండలంలోని ఉప్పలపాడు, శాంతినగర్ గ్రామాల్లోని జామాయిల్ తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తుల వివరాలు మేరకు గురువారం గ్రామాల్లోని సుబాబుల్ తోటల నుంచి ఒక్కసారిగి మంటలు చెలరేగటంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఆకతాయిల పనై ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఉప్పలపాడు గ్రామంలో రూ.50 వేలు, శాంతినగర్ రూ.70 వేల వరకు నష్టం వాటిల్లిఉంటుందని బాధిత రైతులు తెలిపారు.



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

హనుమజ్జయంతి వేడుకలు ప్రారంభం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు దేవస్థాన కార్యనిర్వహణాధికారి తల్లా ప్రగడ సుభద్ర ప్రారంభించారు. దీనిలో భాగంగా ఉదయం మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణలు చేసి పరివార దేవతలైన గణపతి, సుబ్రహ్మణ్యస్వామి వార్లకు, జీవధ్వజ స్తంభం వద్ద నారీకేళాలను సమర్పించారు. ఆనంతరం గణపతి పూజ, నవగ్రహ సహిత, మన్యుసూక్త హోమం, వాస్తు మండపారాధన, అగ్ని ప్రతిష్ఠాపనతోపాటు స్వామివారి సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాలమందు 10 వేల అరటి పండ్లతో పూజ, నివేదన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు, దేవస్థాన సిబ్బంది, ఉభయదాతలు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: హనుమజ్జయంతి ఉత్సవాలను చీరాల పట్టణంలోని బోస్‌నగర్‌లో గల వీరాంజనేయస్వామి దేవాలయంలో ఉత్సవాల్లో భాగంగా గురువారం వీరాంజనేయస్వామికి తమలపాకులతో సహస్రనామార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్తలు బొలిశెట్టి సీతారామాంజనేయులు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, నరసింహస్వామి, సీతారామాంజనేయులు, రమేష్‌బాబు తెలిపారు. జూన్ 3వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు తమిరిశ శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. పేరాలలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనారుషి దేవస్థాన ప్రాంగణంలో గల అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటి అధ్యక్ష, కార్యదర్శులు ఉడతా భాస్కర పార్వతీశ్వరరావు, జి.వెంకటసుబ్బారావులు గురువారం తెలిపారు.



చీరాలలో దర్శనమిస్తున్న వీరాంజనేయస్వామి



హనుమజ్జయంతి వేడుకలు ప్రారంభిస్తున్న దేవస్థాన ఏసీ సుభద్ర

విద్యార్థులకు పెయింటింగ్‌లో శిక్షణ



పెయింటింగ్ వేస్తున్న చిన్నారులు

చినగంజాం: విద్యార్థులు జీవితంలో ఏదో ఒక కళను నేర్చుకోవాలని వక్తలు పేర్కొన్నారు. గురువారం చినగంజాం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని రిసోర్స్ పర్సన్ పి శ్రీనివాసరావు విద్యార్థులచే కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే రిటైర్డ్ డిప్యూటీ కమర్షియల్ టాక్స్ అధికారి అయిన పర్వతరెడ్డి హరిబాబు, సులోచన దంపతులు విద్యార్థులకు అల్పాహారం అందజేశారు.

లారీని ఢీకొట్టిన బైకు

అద్దంకి: లారీని బైకు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైన ఘటన అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో పట్టణంలోని రామ్‌నగర్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగింది. అందిన సమాచారం మేరకు మేదరమెట్ల నుంచి బైకుపై ఇద్దరు యువకులు అద్దంకి వస్తున్నారు. ఈక్రమంలో వారి బైకు ముందున్న లారీనీ దాటే క్రమంలో మరో వాహనం రావడంతో ముందు వెళ్తున్న లారీనీ ఢీకొట్టారు. ఈఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వైద్యం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



ఘటనా స్థలంలో పడిఉన్న క్షతగాత్రులు

క్షతగాత్రులకు స్వీపర్లు కట్లు..

ఈప్రమాదంలో గాయపడిన వారిని వైద్యం కోసం అద్దంకి ప్రభుత్వ వద్యశాలకు చేర్చగా అక్కడ వైద్యులు వారిని పరీక్షించి ప్రథమ చికిత్స చేశారు. అయితే వారికి స్వీపర్ల చేత కట్లు కట్టించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టాఫ్ నర్సులు, నర్సులు ఉండగా వారి చేత కట్టు కట్టించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

రేపటి నుంచి కోలాటం, భజన శిక్షణ

అద్దంకి రూరల్: హనుమజ్జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో కోలాటం, భజన శిక్షణ ఇవ్వనున్నారు. దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పగడాల ఆనంద తీర్థాచార్యుల పర్యవేక్షణలో టీటీడీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కొలాటం, భజనా సమాజాలకు శిక్షణ శిబిరాలకు జూన్ 1వ తేది నుంచి ఏర్పాటు చేయనున్నట్లు ప్రాజెక్టు కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. జూన్ 1తేదిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో, జూన్ 2వ తేదిన ఒంగోలు సంతపేటలోని టీటీడీ కళ్యాణ మండపంలో శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా శిబిరాలకు హాజరయ్యే సమాజాలు టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాల్లో కోలాటలు, భజనలు నిర్వహించేందుకు దేవస్థానం వారు ఆహ్వానిస్తారని తెలిపారు. అవకాశాన్ని అన్ని జిల్లాల సమాజాల వారు వినియోగించుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వరరావు కోరారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



కారంచేడులో వాహనాల తనిఖీల్లో సీఐ, సిబ్బంది



అద్దంకిలో మాట్లాడుతున్న సీఐ కృష్ణయ్య

మార్టూరు/కారంచేడు: రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నిర్వహించిన నాకాబందీ కార్యక్రమంలో భాగంగా మార్టూరులో సీఐ ఎస్వీ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించే జూన్ 4వ తేదీ సందర్భంగా అధికారులు జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న పలు రాకల వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల సందర్భంగా బాణాసంచా విక్రయించినా, కాల్చినా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాల కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎస్సైలు మహబూబ్‌బాషా, సైదా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

☛ అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఉండేందుకు ముందస్తుగా వాహన తనిఖీలను ముమ్మరం చేశామని ఇంకొల్లు సీఐ ఐ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రం కారంచేడు కాలువ సెంటర్ వద్ద ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. పర్చూరు వైపు నుంచి చీరాలకు, చీరాల వైపు నుండి చిలకలూరిపేట, గుంటూరు వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని ఆయన తన సిబ్బందితో కలసి తనిఖీలు చేశారు.

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో ఏడు ప్రాంతాల్లో సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అద్దంకిలోని రామ్‌నగర్ సెంటర్, బస్టాండ్, భవాని సెంటర్, రేణివరం రోడ్డు, కలవకూరు రోడ్డు, దర్శి రోడ్డు, మెయిన్ రోడ్లపై వాహనాలను తనిఖీ చేసి, సరియైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల దృష్ట్యా జూన్ 4 వ తేదివరకు పట్టణంలో 144 సెక్షన్ అమలు ఉందని గుంపులు, గుంపులుగా ఉండవద్దన్నారు.



మార్టూరులో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చీరాల: చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎన్నికల కౌంటింగ్ సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ సోమశేఖర్ అన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఉత్తర్వుల మేరకు గురువారం చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రోశయ్య కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటిని సోదా చేశారు. ఉత్తర్వులు ఉల్లంఘిస్తే సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్‌ను తెరుస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.



సోదాలు నిర్వహిస్తున్న టూటౌన్ సీఐ సోమశేఖర్

నువ్వానేనా అన్నట్లుగా క్రికెట్ పోటీలు

బల్లికురవ: మండలంలోని కొనిదెన గ్రామంలో టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నువ్వానేనా అన్నట్లు రసవత్తరంగా జరుగుతున్నాయి. గురువారం ఉదయం బల్లికుర-మక్కెనవారిపాలెం మధ్య జరిగిన పోరులో బల్లికురవ జట్టు, మధ్యాహ్నం ఇంకొల్లు మండలం నాగండ్ల-సంతమాగులూరు మండలం చవిటిపాలెం మధ్య జరిగిన పోరులో చవిటిపాలెం జట్టు గెలిచింది. సాయంత్రం కొణిదెన-కొమ్మినేనివారి పాలెం మధ్య జరిగిన పోరులో కొమ్మినేనివారిపాలెం జట్టు విజేతలుగా నిలిచాయి. జూన్ 2తో పోటీలు ముగించి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ. 20 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.



ఉత్సాహంగా సాగుతున్న పోటీలు

రేపు వీరాంజనేయ స్వామి తిరునాళ్లు

మార్టూరు: మండలంలోని బొబ్బేపల్లి రాజుగారిపాలెం గ్రామాల మధ్య గల పొలిమేర వీరాంజనేయ స్వామి తిరునాళ్లు జూన్ 1వ తేదీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ 37వ వార్షికోత్సవ సందర్భంగా నేడు బొబ్బేపల్లి రాజుగారిపాలెం గ్రామాల భక్తులచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నారని, రేపు శనివారం ఉదయం 10 గంటలకు సువర్చలా సహిత వీరాంజనేయ స్వామి కల్యాణం, సాయంత్రం 4 గంటలకు ఎడ్ల ప్రదర్శన, కోలాట ప్రదర్శన బృందావన భజన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక తిరునాళ్లు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పమిడిపాడు పంచాయతీ పరిధిలో గల కృష్ణంరాజువారిపాలెం గ్రామంలో కొలువై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం 20వ వార్షిక తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం గణపతి పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహస్ర నామావళి ప్రత్యేక పూజలు భక్తులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్వామి వార్ల కల్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



రుద్రాభిషేక అలంకరణలో స్వామివారు